## క్లుప్తంగా

### ఈఎస్ఐ ఆస్పత్రికి అంబులెన్స్ అందజేత



ఈఎస్ఐ ఆస్పత్రికి అంబులెన్స్ అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

సింథియా : వరల్డ్ వైడ్ డైమండ్స్ మ్యానుఫ్యాక్చరింగ్ లిమిటెడ్ కంపెనీ తమ సీఎస్ఆర్ నిధుల నుంచి గాంధీగ్రామం కార్మిక బీమా ఆస్పత్రికి రూ.16 లక్షలతో అంబులెన్స్, రూ.8లక్షలతో ఆర్వో వాటర్ ప్లాంట్, రూ.9 లక్షలతో అనస్తీషియా వర్క్ స్టేషన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో చీఫ్ జనరల్ మేనేజర్ వి.వెంకటేష్, జనరల్ మేనేజర్ డి.సంజీవ్, హెచ్ఆర్ మేనేజర్ సాయి రామ్ పాల్గొని అంబులెన్స్, వాటర్ ప్లాంట్, అనస్థీషియా వర్క్ స్టేషన్‌ను ఆస్పత్రి సూపరింటెండెంట్ బీవీ రమణమూర్తికి అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### చికిత్స పొందుతూ యువకుడి మృతి


మృతి చెందిన తేజ (ఫైల్)

గోపాలపట్నం: ఎయిర్ పోర్టు పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న అంబేడ్కర్‌నగర్‌లో గురువారం రాత్రి జరిగిన కొట్లాటలో గాయపడిన తేజ చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పాత కక్షల నేపథ్యంలో ఈ గొడవ జరిగిందని తెలిపారు. దావీద్‌పై దాడి చేసేందుకు యత్నిస్తున్న సమయంలో అడ్డుకునే సమయంలో జగదీష్ కత్తితో కడుపులో పొడిచాడు. దీంతో తీవ్ర గాయాలు కావడంలో తేజాను కేజీహెచ్‌లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. దాడికి పాల్పడిన వారిలో కార్తిక్ మైనర్ కావడంతో గురువారం జువైనల్‌కు తరలించారు.

### నేడు మెగా రక్తదాన శిబిరం

విశాఖ విద్య: ఎస్ఏడీ దరి కాకానినగర్ కేటీబీ (కాపు, తెలగ, బలిజ) కార్యాలయంలో ఆదివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు బత్తుల చిరంజీవి తెలిపారు. కాపునాడు వెల్ఫేర్ అసోసియేషన్ (కేటీబీ) కళాక్షేత్రం మొదటి వార్షికోత్సవం సందర్భంగా ఉదయం 10 గంటల నుంచి రక్తదాన శిబిరం ప్రారంభించనున్నట్లు చెప్పారు. రక్తదాలు నేరుగా కళాక్షేత్రానికి రావచ్చని తెలిపారు.

### ఓటు సద్వినియోగంపై ర్యాలీ


ఇండ్రస్ట్రియల్‌కాలనీలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

మల్కాపురం: ఓటు మన ఆయుధమని, ఎంతో మంది ఉత్తములను ఎన్నుకునే అవకాశం ఒక్క ఓటు ద్వారా మాత్రమే ఉంటుందని ములగాడ మండల ఎడ్యుకేషన్ ఆఫీసర్ (ఎంఈవో) త్రినాథరావు అన్నారు.మల్కాపురం సెయింట్ ఆన్స్ మహిళ కళాశాల విద్యార్థినులతో కలిసి ఓటు వినియోగంపై, ఓటుతో కలిగే లాభాలను వివరించారు. 61వ వార్డు పరిధి ఇండ్రస్ట్రియల్ కాలనీ వద్ద నుంచి ప్రకాష్‌నగర్ వరకు అవగాహన ర్యాలీని శనివారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ డి.రమేష్‌నాయుడు, సచివాలయ ఉద్యోగులు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

### బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

మల్కాపురం : భారతీయ జనతా పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని పారిశ్రామిక పరిధిలోని పలు వార్డుల్లో శనివారం నిర్వహించారు. దీనిలో భాగంగా 61వ వార్డు మల్కాపురం వద్ద జరిగిన కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు పంచదార్ల అప్పలరాజుయాదవ్ కేక్ కట్ చేశారు. భారతీయ జనతా పార్టీలో ఉన్న జాతీయ,రాష్ట్ర స్థాయి నాయకులు అందించిన సేవలను కీర్తించారు. దేశ ప్రధాని నరేంద్ర మోడీ, దివంగత ప్రధాని వాజ్‌పేయి, అద్వాని ఇలా పలువురు ప్రముఖులు బీజేపీ ద్వారా అందించిన సేవలను కొనియాడారు. 59వ వార్డులో పార్టీ నాయకులు కేక్ కట్ చేశారు.




మల్కాపురంలో డోర్ టూ డోర్ ప్రచారంలో ఆడారి ఆనంద్‌కుమార్


డప్పులు వాయిస్తు ఆనంద్‌కు స్వాగతం పలుకుతున్న పార్టీ నాయకులు

# అందుబాటులో ఉంటా.. సేవ చేస్తా..


ఓటర్‌తో మాట్లాడుతున్న ఆడారి ఆనంద్‌కుమార్

- వైఎస్సార్‌సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్
- 61వ వార్డులో విస్తృతంగా ప్రచారం

మల్కాపురం : నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజలకు సేవ చేయాలన్నదే తన అభిమతమని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ పేర్కొన్నారు. ప్రజల ఓట్లతో గెలిచిన తరువాత ముఖం చాటేసి తిరిగే నైజం తనది కాదని.. పరోక్షంగా టీడీపీ ఎమ్మెల్యే గణబాబునుద్దేశించి విమర్శలు చేశారు. కష్టకాలంలో అండగా ఉన్నవాడే అసలైన నాయకుడని, ఆ లక్షణాలు ఇంతవరకు నియోజకవర్గంలో అధికారం చెలాయించిన గణబాబు ఏమాత్రం లేవన్నారు. నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజల కష్టాల్లో పాల్గొంచుకునే వ్యక్తిగా తనను వచ్చే ఎన్నికల్లో గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం, మూడు నూతుల సెంటర్ నుంచి శనివారం ఎన్నికల ప్రచారాన్ని ఆయన చేపట్టారు. వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో తిరిగి జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కావడం తథ్యమన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నుంచి పేద ప్రజలు మరింత మేలు అందుకునే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. జగన్‌ను నమ్ముకున్న వారికి న్యాయమే తప్పా మోసం జరగదన్నారు. చంద్రబాబు మాదిరిగా నమ్ముకున్న ప్రజలను, పార్టీ నేతలను మోసం చేయడంలో చంద్రబాబుకు మించిన వ్యక్తి మరొకరు లేరన్నారు. పవన్ కల్యాణ్‌కు నిలకడ లేదని, ఆ పార్టీ పుట్టిందే చంద్రబాబు కోసమన్నారు. ఎంత కష్టం వచ్చిన ఇచ్చిన మాటకు కట్టుబడే వ్యక్తి మన జగనన్న అని, అలాంటి వ్యక్తి రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయితే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. కూటమి నాయకులు చెప్పే మాటలు విని ప్రజలు మోసపోవద్దని సూచించారు. వారి గెలిస్తే ఇప్పుడున్న అందుకుంటున్న సంక్షేమ పథకాలన్నీ ఆగిపోతాయని, సంక్షేమ పథకాలను ఇళ్లకే చేరుస్తున్న వలంటీర్ వ్యవస్థను రద్దు చేస్తారని, అప్పుడు ఏ ప్రభుత్వ పథకం కావాలన్నీ ఆయా కార్యాలయాల చుట్టూ తిరిగాల్సిన పరిస్థితులుంటాయన్నారు. ఓటు వేసే ప్రజలంతా ఒక్కసారి ఆలోచించి మేలు చేసే జగనన్న ప్రభుత్వానికే మద్దతు పలకాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ, ట్రేడ్ యూనియన్ రీజనల్ కో- ఆర్డినేటర్ బద్రినాథ్, జేసీఎస్ కన్వీనర్ భోగవల్లి నాగభూషణం, వార్డు పార్టీ అధ్యక్షుడు కేబుల్ వాసు, దాడి సత్యనారాయణ, బూస అప్పలరెడ్డి, నూకరెడ్డి, బూస అప్పలరెడ్డి, ఎస్.వి.రమణ, బాలు, మంగ, పిలక వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అలాగే 60వ వార్డు పరిధి జనతాకాలనీ వద్ద వార్డు కార్పొరేటర్ పి.వి.సురేష్ ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల ప్రచార కార్యక్రమంలో యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి పాల్గొన్నారు. జై దుర్గాదేవి ఆలయంలో పూజలు జరిపారు. అనంతరం ఆ ప్రాంతంలో డోర్ టూ డోర్ ప్రచారాన్ని నిర్వహించారు. ఆడారి ఆనంద్ కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆమె ప్రజలను అభ్యర్థించారు. కార్యక్రమంలో క్లస్టర్-2 అధ్యక్షుడు అంగ రామ్‌ప్రసాద్, వార్డు పార్టీ అధ్యక్షుడు ఆడారి హరీష్, వార్డు ఇన్‌చార్జ్ జీ.వి.ఎల్.నరేష్, మాజీ కార్పొరేటర్, జేసీఎస్ కన్వీనర్ పిల్లా కన్నబాబు, మధు, కనక మహాలక్ష్మి దేవస్థానం ట్రస్ట్ బోర్డు డైరెక్టర్ మళ్ల ధనలత, బిల్డర్ సంతోష్, వాసు పాల్గొన్నారు.


60వ వార్డులో ప్రచారంలో పాల్గొన్న పిల్లా రమాకుమారి

## ఆడారిని గెలిపించండి


63వ వార్డు ప్రకాష్‌నగర్‌లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్న వార్డు ఇన్‌చార్జ్ రామ్మోహన్‌రెడ్డి

సింథియా : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వస్తేనే దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారం అవుతాయని జీవీఎంసీ 63వ వార్డు ఆ పార్టీ ఇంచార్జ్ పిలక రామ్మోహనరెడ్డి అన్నారు. శనివారం 161 పోలింగ్‌బూత్‌ల పరిధిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక నాయకులతో కలిసి పోలింగ్‌బూత్ పరిధిలోని గడపగడపకు వెళ్లి ఫ్యాను గుర్తుపై ఓటు వేసి పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్, ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నూటికి నూరు శాతం అమలు చేశారని, మళ్లీ ఆయనను గెలిపించుకుంటేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, ఆయా పోలింగ్ బూత్‌ల సభ్యులు పాల్గొన్నారు.

## మమత చారిటీకి మినీ వ్యాన్ అందజేత


మినీ వ్యాన్ అందజేసిన భెల్ ప్రతినిధులు

విశాఖ విద్య: మమత చారిటబుల్ ట్రస్టు ద్వారా చేస్తున్న సేవలను మరింత విస్తరించేందుకు వీలుగా భెల్ యాజమాన్యం మినీ వ్యాన్ అందజేసింది. సంస్థ ప్రతినిధులు శనివారం మమత చారిటబుల్ ట్రస్టు ఫౌండర్ ఎల్లేటి మమతకు మినీ వ్యాన్ అప్పగించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ అనాథలకు ఆశ్రయమివ్వటమే కాకుండా, అనాథలకు మమత చారిటీ ద్వారా అంత్యక్రియలు సైతం నిర్వహిస్తుండటం గొప్ప విషయమన్నారు. ఈ విషయంలో ఎల్లేటి మమత మరెంతో మందికి స్ఫూర్తిగా నిలుస్తారన్నారు. మహిళ అయినప్పటికీ మమత తన చారిటబుల్ సంస్థ ద్వారా చేస్తున్న సేవా కార్యక్రమాలకు బెల్ కంపెనీ చోదోడుగా నిలువాలనే ఉద్దేశంతో ముందుకొచ్చామన్నారు. అత్యవసర సమయాల్లో అవసరమైన వారిని వైద్యం కోసమని కేజీహెచ్‌కు తరలించటం, అదేవిధంగా అనాథ శవాలను అంత్యక్రియల నిమిత్తం శ్మశాన వాటికల వరకు తీసుకెళ్లేందుకు వీలుగా మినీ వ్యాన్ అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో భెల్ సంస్థ ఈడీ ఎస్. జితేందర్ రెడ్డి, జనరల్ మేనేజర్లు ఆర్‌సీవీఎస్. ప్రసాద్, ఎంఎస్, శ్రీనివాస రావు,ఏజీఎం దిబాకర్ పట్నాయక్, హెల్పింగ్ హ్యాండ్ సెక్రటరీ లక్ష్మీకాంత్ పాల్గొన్నారు.

## అండగా ఉంటాం


ఉట్టిబాబు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మొల్లేటి ఉట్టిబాబు కుటుంబాన్ని జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు పరామర్శించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఎలాంటి సాయం కావాలన్నా తనకు కలవాలన్నారు. ప్రమాదానికి కారణమైన లారీ యజమాని సాయం అందజేస్తామని చెప్పిందని, అయితే ఇంతవరకు స్పందించలేదని ఆటో యూనియన్ సభ్యులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. మోహన్, ఆటో యూనియన్ నాయకు లు పాల్గొన్నారు.

## బాధ్యతగా ఎన్నికల విధులు


అధికారులకు సూచనలిస్తున్న ఆర్వో హుస్సేన్‌సాహెబ్

కంచరపాలెం: జ్ఞానాపురం జోన్-5 జోనల్ కార్యాలయంలో పశ్చిమ నియోజకవర్గ-24 ఎన్నికల రిటర్నింగ్ కార్యాలయం సమావేశంలో శనివారం సెక్టార్ అధికారులు, రూట్ అధికారులు, పోలీస్ అధికారులు, సూపర్‌వైజర్లతో పశ్చిమ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి(ఆర్‌వో) హుస్సేన్‌సాహెబ్ సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాల్లో 85 ఏళ్ల దాటిన వృద్ధులు, దివ్యాంగులకు సంబంధించి పోస్టల్ బ్యాలెట్‌పై పలు సూచనలిచ్చి, వివరాలు సేకరించాలని ఆయన ఆదేశించారు. పీవోలు, ఏపీవోలకు రెండు రోజులు పాటు శిక్షణ ఉంటుందని తెలిపారు. ఎన్నికల విధి నిర్వహణలో పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎటువంటి అలసత్వం ఉండకూడదని, పోలింగ్ కేంద్రాల్లో అన్ని మౌలిక సదుపాయాలు ఉండేలా చూసుకోవాలని ఆర్‌వో హుస్సేన్‌సాహెబ్ సూచించారు.

## ఘనంగా నూకాంబిక అమ్మవారి మహోత్సవాలు

- ఘనంగా ప్రారంభమైన శ్రీ నూకాంబిక అమ్మవారి పండగ మహోత్సవాలు


శ్రీ నూకాంబిక అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న వార్డు కార్పొరేటర్ నాగేశ్వరరావు

సింథియా : జీవీఎంసీ 40వ వార్డు పరిధి ఏకేసీకాలనీలోని నూకాంబిక అమ్మవారి పండగ మహోత్సవాలు వార్డు కార్పొరేటర్, ఆలయ ధర్మకర్త గుండపు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం ఎంతో వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఉదయం 5 గంటల నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం భారీ బాణసంచాతో తప్పెడుగుళ్లతో నూకాంబిక అమ్మవారి ఘటాల ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డులోని మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఘటాలను పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## యువజనుల సాధికారతకు కృషి అవసరం


ప్రసంగిస్తున్న న్యాయమూర్తి విజయ్‌చందర్

ఏయూ క్యాంపస్: యువజనుల సాధికారతకు కృషి చేయాలని, వెనకబడిన వర్గాల అభ్యున్నతికి సాధ్యమైనంత వరకు న్యాయ సహాయం అందించాలని విజయనగరం జిల్లా కొత్తవలస సివిల్ జడ్జి డాక్టర్ ఎస్.విజయచందర్ పేర్కొన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మూడు రోజుల శిక్షణ తరగతుల కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. మార్పునకు వాహకాలుగా జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారులు, వలంటీర్లు నిలుస్తారన్నారు. రాజీవ్ గాంధీ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యూత్ డెవలప్‌మెంట్ ఆచార్యులు డాక్టర్ వాసంతి రాజేంద్రన్ వర్చువల్ విధానంలో మాట్లాడుతూ ఇక్కడ ప్రోగ్రాం అధికారులు నేర్చుకున్న వైవిధ్యమైన జ్ఞానాన్ని వలంటీర్లకు చేరువ చేయాలని, తద్వారా సమాజంలోని ప్రజలకు అవి చేరుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. పటిష్టమైన యువజన నాయకత్వాన్ని దేశానికి అందించడం ధ్యేయంగా రాజీవ్ గాంధీ జాతీయ యువజన అభివృద్ధి సంస్థ పని చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఏయూ జాతీయ సేవా పథకం సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్, కన్వీనర్ డాక్టర్ కె.పల్లవి, జిల్లా ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి, సీనియర్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ మాణిక్యకుమారి, డాక్టర్ చంద్, డాక్టర్ ప్రతాప్, వై.అనసూయదేవి తదితరులు శిక్షణపై తమ అభిప్రాయాలను తెలయజేశారు. చివరి రోజు కార్యక్రమంలో భాగంగా పోక్సో చట్టంపై డాక్టర్ పల్లవి, వినియోగదారుల హక్కులపై ఆచార్య రాజేంద్రప్రసాద్, మానవ హక్కులు-యువత పాత్రపై ఆచార్య రాజ్యలక్ష్మి కీలకోపన్యాసాలు చేశారు. అనంతరం శిక్షణలో పాల్గొన్న ప్రోగ్రాం అధికారులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు.

## అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు


నిత్యకల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు.

**ఘనంగా గరుడసేవ**

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గరుడసేవ ఘనంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందంజస్వామిని గరుడవాహనంపై అధిష్టంపజేసి అష్టోత్తర శతనామవళి పూజ చేశారు. స్వామికి హారతులు అందజేశారు.

# ఇంటికల నెరవేరిన వేళ..

- అర్హులందరికీ టిడ్కో ఇళ్లు
- ఆనందం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు


అచ్చినాయుడులోవ కొండ ప్రాంతంలో టిడ్కో గృహసముదాయాలు


తమకు కేటాయించిన ఇళ్ల వద్ద ఆనందంతో లబ్ధిదారులు గ్రూప్ ఫొటో

మల్కాపురం: వారంతా రోజూ కష్టపడితేగానీ రెండు పూటలా తినడం గగనం. వచ్చిదాంట్లో నానా కష్టాలు పడి సర్దుకుంటున్నారు. ఇంటి అద్దెలు చెల్లించలేక..పిల్లలకు సరైన చదువులు చదివించలేని వైనం..ఇలాంటి పరిస్థితుల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వారికి అండగా నిలిచింది. అనేక సంక్షేమ పథకాలతో ఆర్థిక ఇబ్బందులను తీర్చింది. గత ప్రభుత్వ హయాంలో ఎన్నో ఇబ్బందులు పడ్డాం. రేషన్ కార్డు కావాలన్నా కార్యాలయాలు చుట్టూ తిరిగాం..జన్మభూమి కమిటీలు సంక్షేమ పథకాల కోసం డబ్బులు కూడా చెల్లించేపరిస్థితులు చూశాం..కానీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తరువాత వలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చారు. సంక్షేమ పథకాలు ఇళ్లకే చేరువ చేశారు. ఎవరికీ ఒక్క రూపాయి ఇవ్వకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోనే సంక్షేమ పథకాల నగదు జమ అవుతోంది. తాజాగా చాలా ప్రాంతాల్లో టిడ్కో ఇళ్లను అందజేసి పేదల ఇంటికలను నిజం చేసింది. నాడు ఇల్లు కావాలంటే జన్మభూమి కమిటీకి డబ్బు ముట్టజెపాల్సిన పరిస్థితి. నేడు ఒక్క పైసా ఖర్చు లేకుండా రిజిస్ట్రేషన్, నూతన వస్త్రాలు, మంచి భోజనం పెట్టి మరీ ఇంటి తాళాలను అందజేశారని వారంతా ఎందో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పారిశ్రామిక ప్రాంత పరిధి 40,58,59,60,61,62, 63వ వార్డుల పరిధి నుంచి సుమారు 5 వేల మంది ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. అయితే వీరిలో అర్హులను గుర్తించిన జీవీఎంసీ అధికారులు 58వ వార్డు ములగాడ వద్ద ఆధునిక వసతులతో కూడిన సుమారు 336 టిడ్కో ఇళ్లను, అలాగే 62వ వార్డు అచ్చినాయుడులోవ కొండ ప్రాంతంలో 300 ఎస్ఎఫ్‌టీలో 1,344 మందికి, అలాగే 365 ఎస్ఎఫ్‌టీ విస్తీర్ణంలో నిర్మించిన సుమారు 624 ఇళ్లు, 430 ఎస్ఎఫ్‌టీ విస్తీర్ణంలో నిర్మించిన సుమారు 2016 ఇళ్లను అంటే మొత్తం 3,984 ఇళ్లను అర్హులకు కేటాయించారు. వీరికి రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేశారు.

### జగనన్నకు కృతజ్ఞతలు



నిరుపేద కుటుంబానికి చెందిన తనకు జగనన్న సొంతింటి కల నెరవేర్చాడు. ఇంతవరకు అద్దె ఇంట్లో ఉండేవాళ్లం. అద్దె చెల్లించలేక ఇబ్బంది పడేవాళ్లం. సొంతింటి కోసం 15 ఎళ్లుగా ఎదురు చూశా. జగనన్న అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో తన కల నెరవేర్చాడు. బతికినంత కాలం జగనన్నకు రుణపడి ఉంటాను.

– జామి జానకమ్మ,ఏకేసీ కాలనీ

### చాలా ఆనందంగా ఉంది

సొంత ఇల్లు కలగా మిగిలిపోతుందనుకున్నాం. గత టీడీపీ ప్రభుత్వం హయాంలో అనేకసార్లు అధికారులు,జన్మభూమి కమిటీల చుట్టూ తిరిగాను. అయినా ఫలితం లేదు. ఇదిగో ..అదిగోఅని కాలయాపన చేశారు. జగనన్న అధికారంలోకి వచ్చిన తరువాత ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నాను.తన వద్దకు వలంటరీ వచ్చి ఇంటి కోసం వివరాలు తీసుకున్నారు. ఇప్పుడు నాకు సొంత ఇల్లు సమకూరింది.

– దండు మాలతి
ఇందిరాకాలనీ

### రుణపడి ఉంటా

సుమారు రూ.7 లక్షల విలువ గల టిడ్కో ఇల్లు సకల వసతులతో ఒక పైసా ఖర్చు లేకుండా నా సొంతమైంది. దీనికి కారణం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం. అర్హతే ఆధారంగా జగనన్న మాకు ఇల్లు కేటాయించారు. జీవితాంతం జగన్‌కు రుణపడి ఉంటా. ఆయనే మళ్లీ ముఖ్యమంత్రి కావాలి.

– పత్రాన లక్ష్మి,
శ్రీహరిపురం

## పలు ఆలయాల్లో శనిత్రయోదశ పూజలు

మల్కాపురం : శని త్రయోదశ సందర్భంగా పారిశ్రామిక ప్రాంతం పరిధిలోని ఆలయాల్లో నవగ్రహ దేవత మూర్తులకు అర్చకులు శనివారం నాడు నువ్వులు,తైలం,పాలతో అభిషేకాలను జరిపారు.దీనిలో భాగంగా ఐటీసీ చింతామణి దుర్గగణపతి ఆలయంలో కొలువు దీరిన నవ గ్రహదేవతలకు ఆలయ అర్చకులు తైలంతో అభిషేకాలను జరిపి,నల్లటి వస్త్రాలను అలంకరించి శని దోష తొలగింపు పూజలను చేపట్టారు.అనంతరం ఇక్కడ కొలువుదీరిన భ్రమరాంభ సమేత మల్లికార్జున స్వామికి, శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలను జరిపారు. అలాగే ప్రకాష్‌నగర్, శ్రీహరిపురం వద్ద గల హరిహర క్షేత్రంలో కొలువుదీరిన నవగ్రహ దేవత మూర్తులకు శని దోష తొలగింపు పూజలను చేపట్టారు.

## కేజీహెచ్‌కు వెళ్లి పింఛన్ అందజేత



విశాఖ విద్య: సామాజిక పింఛన్ల పంపిణీ శనివారం కూడా కొనసాగింది. సచివాలయాలకు వచ్చిన వారికి ఇప్పటి వరకు పింఛన్లు అందజేసిన ఉద్యోగులు, ప్రస్తుతం ఇళ్ల వద్ద, ఇతర ప్రాంతాల్లో ఉన్న వారికి సైతం అందజేస్తున్నారు. జీవీఎంసీ 90వ వార్డు లక్ష్మీనగర్ ఎఫ్-బ్లాక్ కు చెందిన కె. లక్ష్మీనారాయణ ప్రసాదరావు అనారోగ్యం కారణంగా కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న బుచ్చిరాజుపాలెం సచివాలయ శానిటరీ కార్యదర్శి జి. రామకృష్ణ శనివారం కేజీహెచ్‌కు వెళ్లి పింఛను అందజేశారు.

## ‘బీజేపీతో పొత్తు ఉక్కును అమ్మడానికా?’

గాజువాక: బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ భాగస్వామిగా చేరిన టీడీపీ విశాఖ స్టీల్ ప్లాంట్‌ను రక్షిస్తుందంటూ ఆ కూటమి విశాఖ పార్లమెంట్ అభ్యర్థి శ్రీభరత్, గాజువాక అసెంబ్లీ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు ప్రకటించడం హాస్యాస్పదమని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వారి ప్రకటన దెయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉందన్నారు. ఎందరో త్యాగాలతో సాధించుకున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కేంద్ర బీజేపీ ప్రభుత్వం అమ్మకానికి పెట్టిందన్నారు. ప్లాంట్‌ను అష్టదిగ్బంధం చేసి నష్టాల్లోకి నెట్టి ప్రధానమంత్రి మోదీ అనుకూల కార్పొరేట్లకు కట్టబెట్టే కుట్రలో బీజేపీ ప్రభుత్వం ఉందన్నారు. ప్రజలకు ద్రోహం చేస్తున్న బీజేపీతో టీడీపీ, జనసేన పొత్తు వల్ల విశాఖ స్టీల్‌ప్లాంట్ మరింత ప్రమాదంలో పడిందన్నారు. బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి వల్ల స్టీల్‌ప్లాంట్‌ను రక్షించలేరని, అమ్మకానికే మార్గం సుగమం చేస్తారని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర ద్రోహం చేసిన బీజేపీ సాయంతో విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను రక్షించడంతో పాటు విశాఖ రైల్వేజోన్‌ను, విశాఖ మెట్రో రైల్‌ను సాధిస్తామని టీడీపీ మేనిఫెస్టోలో ప్రకటించడం విశాఖ ప్రజలను మరోసారి మోసం చేయడమేనని తాము భావిస్తున్నామన్నారు.